డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి

20 రోజుల జైలుశిక్ష

పంజాగుట్ట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి 20 రోజుల జైలుశిక్ష, రూ.2100 జరిమానా విధించామని పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తెలిపారు. గత నెల 27న ట్రాఫిక్ పోలీసులు పంజాగుట్ట చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తుండగా సైదాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ కొర్ర చందు(46) పట్టుబడ్డాడు. అతనికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేయగా రక్తంలో బ్లడ్ ఆల్కహాల్(బీఏసీ)550 ఎంజీ వచ్చింది. అలాగే గత సంవత్సరం డిసెంబరు 31న జలగం వెంగళరావు పార్క్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా బోరబండకు చెందిన ద్విచక్ర వాహనదారుడు మహమ్మద్ రియాజుద్దీన్(51)పట్టుబడ్డాడు. అతనికి పరీక్ష నిర్వహించగా బీఏసీ 550 ఎంజీ వచ్చింది. పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. కౌన్సెలింగ్ అనంతరం గురువారం నాంపల్లిలోని 11వ జెఎఫ్ఎంసీ న్యాయస్థానంలో హాజరు పరిచారు. జడ్జి స్వాతి మురారి కేసు పరిశీలించి ఇద్దరికీ 20 రోజుల జైలు శిక్ష, రూ.2100 రూపాయల జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో వాహనదారులు పట్టుబడిన ఘటనలో అత్యధికంగా 20 రోజుల జైలుశిక్ష పడటం ఈ సంవత్సరం ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు. వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని రవాణా అధికారులకు లేఖ రాయనున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఉపాధి రంగాల్లో మహిళలు రాణించాలి

బోరబండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు వృత్తి, ఉపాధి రంగాలను ఎంచుకొని పురుషులతో సమానంగా రాణించాలని సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ జకీయా సుల్తానా, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హబీబా సుల్తానాలు అన్నారు. బంజారానగర్ కొమురం భీమ్ కమ్యూనిటీ హాల్‌లో లైట్‌హౌస్ క్లస్టర్ సంస్థ ఆధ్వర్యంలో వృత్తి విద్య నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గృహిణులు చేతి వృత్తి పనులను నేర్చుకొని ఇంట్లోనే ఉంటూ డబ్బులు సంపదించవచ్చన్నారు. కార్యక్రమంలో బోరబండ ఎస్ఐ ఎండీ సర్దార్ జమాల్, సంస్థ ప్రతినిధులు ఆర్తి, స్పందన, కౌన్సిల్ శ్రీనివాస్, బస్తీ నాయకులు అశోక్, కాసుల మహేష్ గౌడ్, ఆనంద్, దేవేందర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ 15 ఆలిండియా మెగా చెస్ టోర్నమెంట్

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వరాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి అండర్ 15 ఆలిండియా మెగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అకాడమీ ఫౌండర్, చీఫ్ కోచ్ రాఘవ్ శ్రీవాత్సవ్ వరయోగి తెలిపారు. జాతీయ స్థాయిలో రెండోసారి ఏర్పాటు చేస్తున్న మెగా చెస్ టోర్నమెంట్ విజేతలకు రూ.75 వేల నగదుతోపాటు 50 ట్రోఫీలు అందిస్తామన్నారు. బేగంపేట పాటిగడ్డ జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్(రసూల్‌పురా మెట్రోస్టేషన్) సమీపంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 7396847937 నంబర్‌ను సంప్రదించాలని, వివరాలకు www.varaschessacadamy.com వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేఎన్ గోవిందాచార్య, వేణుగోపాల్ రెడ్డి, లీలా లక్ష్మారెడ్డి, మాధవ రెడ్డి తదితరులు

29 నుంచి 'భారతీయ సంస్కృతి ఉత్సవ్-7'

- కర్ణాటక రాష్ట్రం సేడంలో నిర్వహణ

పంజాగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం పనిచేసే శక్తులు, వ్యక్తులు ఒకే వేదిక మీదికి రావాలని బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, భారత్ వికాస్ సంగం(బీవీఎస్)చీఫ్ ప్యాట్రన్ కేఎన్ గోవిందా చార్య అన్నారు. కొత్తల బసవేశ్వర భారతీయ శిక్షణ సమితి, భారత్ వికాస్ సంఘం, వికాస్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ప్రపంచంలోనే అతి పెద్ద సంస్కృతి ఉత్సవం 'భారతీయ సంస్కృతి ఉత్సవ్-7'ను కర్ణాటక రాష్ట్రం కలబురగీ జిల్లా సేడంలోని ప్రకృతి నగరలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీవీఎస్ ప్యాట్రన్ పి.వేణుగోపాల్ రెడ్డి, జాతీయ అధ్యక్షుడు ఎడ్మ మాధవ రెడ్డి,ఆహ్వాన కమిటీ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి లతో కలిసి భారతీయ సంస్కృతి ఉత్సవ్-7 బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవిందా చార్య మాట్లాడుతూ, భారతీయ వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి భారతీయ సంస్కృతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఆరుసార్లు నిర్వహించగా ఇది ఏడోసారి అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

27న 'వారధి' ఆవిర్భావం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంఘం, సంస్కృతి, వాణిజ్యం (3సీ) ఈ మూడు ప్రధానాంశాలుగా కార్యకలాపాలు నిర్వహించేందుకు వారధి సంస్థ ఏర్పాటైంది. ఈ సంస్థ ప్రారంభ కార్యక్రమాన్ని ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గంజి జగన్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలో ఉండే చిన్న వ్యాపారులను అనుసంధానించడానికి తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(టీఏఎంసీసీఐ) సంస్థ పని చేస్తుందన్నారు. వారధి ప్రారంభోత్సవానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మను ఆహ్వానించామని తెలిపారు. కార్యక్రమానికి గవర్నర్‌తో పాటు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి, మార్గదర్శి సంస్థల ఎండీ శ్రీమతి శైలజా కిరణ్, సినీనటుడు సాయికుమార్, పారిశ్రామిక వేత్తలు, ప్రముఖ వ్యాపారులు, సంఘం, సంస్కృతి, వాణిజ్య రంగాల నుంచి ప్రముఖులు హాజరవుతారన్నారు.



బేగంపేట్ బస్తీలో ఫుట్‌పాత్ వ్యాపారాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ మహేశ్వరి

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలి

- మాజీ మంత్రి తలసాని

బేగంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫుట్‌పాత్ వ్యాపారులకు సూచించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసే వ్యాపారులను తొలగిస్తున్న నేపథ్యంలో తాము తీవ్రస్థాయిలో నష్టపోయే ప్రమాదం ఉందని వారు తలసానిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన కార్పొరేటర్ మహేశ్వరి జీహెచ్ఎంసీ డీసీ సమ్మయ్య, ట్రాఫిక్ ఏసీ శంకర్ రాజు, ఇతర అధికారులతో కలిసి మోండా డివిజన్ పాలికా బజార్ చౌరస్తా, మోండా మార్కెట్, రాంగోపాల్‌పేట డివిజన్‌లోని అంజలి టాకీస్ దర్గా, ఎస్‌పీ రోడ్, మినిస్టర్ రోడ్, బేగంపేట డివిజన్‌లోని జవహర్ జనతా, ఓల్డ్ కస్టమ్ బస్తీ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి కొందరు రోజువారి అద్దెలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎవరికి అద్దెలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే ఫుట్‌పాత్ వ్యాపారులకు ఫోటోతో కూడిన గుర్తింపు కార్డులను జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుష్మిత, పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ!

- బంజారాహిల్స్‌లో రోడ్డుపై నిరూపయోగంగా విద్యుత్ స్తంభాలు
- జీడిమెట్ల రాంరెడ్డినగర్‌లో పగుళ్లు వచ్చిన సిమెంట్ దిమ్మెలు
- అడ్డదారిలో టన్నుల కొద్దీ స్క్రాప్ అమ్మకాలు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ





జీడిమెట్ల రాంరెడ్డినగర్‌లో పగుళ్లువచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చే సిమెంట్ దిమ్మెలు

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడ్ పడకుండా గ్రేటర్‌లో వందల సంఖ్యలో కొత్తగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను దక్షిణ డిస్కం ఏర్పాటు చేస్తోంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్న విద్యుత్‌శాఖ గతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను గాలికి వదిలేసింది. జీడిమెట్ల రాంరెడ్డినగర్, గాజులరామారం, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు నిర్మించిన సిమెంట్ దిమ్మెలకు పగుళ్లు వచ్చి ఎప్పుడు విరిగిపడతాయో అనే పరిస్థితుల్లో దర్శనమిస్తున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్న స్థానిక విద్యుత్‌శాఖ అధికారులు వాటి నాణ్యతను మాత్రం పట్టించుకోవడం లేదు. బాచుపల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో కొంతమంది కాంట్రాక్టర్లు పైపైనే మరమ్మతులు చేసినా అధికారులు కన్నెత్తి చూడకుండా బిల్లులు మంజూరు చేస్తున్నారు. సంగారెడ్డి సర్కిల్ పటాన్‌చెరువు డివిజన్‌లో ఓ ఆర్టిజన్ అక్రమంగా టన్నుల కొద్ది ఇనుప సామగ్రిని అమ్ముకున్నా ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేపట్టలేదు. శివారు ప్రాంతాల్లో కొంతమంది ఆర్టిజన్, లైన్‌మన్లు ఏళ్లతరబడి ఒకే ప్రాంతంలో పనిచేస్తూ భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారు. స్థానిక అధికారుల అండతో కొందరు ఆర్టిజన్లు ప్రైవేట్ కాంట్రాక్టర్లుగా మారి యదేచ్ఛగా కాంట్రాక్ట్ పనులు చేపడుతున్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదు. బంజారాహిల్స్ సబ్ డివిజన్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకోకపోవడంతో వాహనాలు తగిలి స్తంభాలు విరిగిపోతున్నాయి. దక్షిణ డిస్కం లక్షల నిధులు పెట్టి కొనుగోలు చేస్తున్న విద్యుత్ సామగ్రిని రోడ్లపై నిర్లక్ష్యంగా వదిలేయడంతో నిరూపయోగంగా మారాయి. గత ఐదేళ్లలో దక్షిణ డిస్కం సర్కిళ్ల వారీగా కొనుగోలు చేసిన విద్యుత్ సామగ్రి, డివిజన్లు, సెక్షన్ల కేటాయింపులపై పూర్తి స్థాయిలో విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటపడతాయని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.



బంజారాహిల్స్ ఏడీఈ కార్యాలయం ముందు రోడ్డుపై నిరూపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

పెట్టుబడులకు గమ్యస్థానంగా అసోం

ఆ రాష్ట్ర మంత్రి డాక్టర్ రనోజ్ పెగు ● నగరంలో 'అడ్వాంటేజ్ అసోం 2.0' రోడ్డు షో



రోడ్డు షోను ప్రారంభిస్తున్న డాక్టర్ రనోజ్ పెగు, తదితరులు

బంజారాహిల్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులను ఆకర్షించేందుకు అసోంను అన్ని రకాలుగా సిద్ధం చేస్తున్నట్టు ఆ రాష్ట్ర విద్యా, గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ రణోజ్ పెగు పేర్కొన్నారు. సింగిల్ విండో ద్వారా పెట్టుబడులకు క్లియరెన్స్ ఇస్తున్నట్టు చెప్పారు. అసోంలోని గౌహతిలో ఫిబ్రవరి 25, 26 తేదీలలో 'అడ్వాంటేజ్ అసో 2.0' పేరుతో నిర్వహించనున్న పెట్టుబడులు, మౌలిక సదుపాయాల సదస్సుకు పెట్టుబడిదారులను సమాయత్తం చేయడమే లక్ష్యంగా బంజారాహిల్స్ తాజ్ కృష్ణలో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోంలో ఉన్న అవకాశాలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఆకట్టుకుంటున్నాయన్నారు. కమ్యూనికేషన్, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధిలో ప్రగతి సాధించినట్టు చెప్పారు. విద్యా రంగంలో సాంకేతికతను వినియోగిస్తూ.. వ్యవస్థలను విప్లవాత్మకంగా మార్చామన్నారు. పాఠశాలల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఇది ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలను పెంచుతుందన్నారు. మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్యను పెంచినట్టు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో అర్హత కలిగిన యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లడాన్ని అరికట్టేందుకు అసోం స్కిల్ యూనివర్సిటీని స్థాపించినట్టు పేర్కొన్నారు. అసోం కార్మిక సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి బీ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ గడచిన దశాబ్దంలో అసోం అసాధారణ ఆర్థిక వృద్ధిని సాధించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 29 బిలియన్ల డాలర్ల నుంచి 68 బిలియన్ల డాలర్లకు పెరిగిందని తెలిపారు. 2030 నాటికి 130 బిలియన్ల డాలర్ల లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్టు వెల్లడించారు. దక్షిణాసియా ప్రాంతాన్ని అసోంతో కలిపే మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేస్తుండటం ప్రముఖ పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందని చెప్పారు. లక్ష కోట్ల పెట్టుబడితో మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల మీద దృష్టి సారించి, అసోంను ముఖ్య ఆర్థిక కేంద్రంగా మార్చడంలో ముందడుగు వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ప్రధాన కార్యదర్శి కేఎస్ గోపీనాథ్ నారాయణన్, వాణిజ్యశాఖ కమిషనర్ ఓజనం ఎస్ సింగ్, ఫిక్కీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్, వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్, ఉపాధ్యక్షుడు, గజా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వీవీ రామరాజు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నర్సింహులు, బాలాజీ గోస్వామి తదితరులు

ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్‌లో

ఏపీ మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు

బంజారాహిల్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ఐటీ శాఖ మంత్రినారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్‌లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అడ్‌హాక్ కమిటీ సభ్యులు నర్సింహులు, బాలాజీగోస్వామి, దినేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో జరిగిన పూజాధికాలకు పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కాని నర్సింహులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బంజారాహిల్స్ నందమూరి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వద్ద తెలుగుదేశం ఫోరం సింగపూర్ సభ్యులు సుమారు 400 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యుడు మట్టా రమేష్ మాట్లాడుతూ, లోకేష్ జన్మదినం సందర్భంగా ప్రతీ సంవత్సరం పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. నారా లోకేష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్థిల్లాలని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు సుధాకర్ యాదవ్,నాగరాజు, దీపక్, నరేంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో పెట్టి సెల్‌ఫోన్ స్నాచింగ్

బంజారాహిల్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మాటల్లో పెట్టి జెప్టో డెలవరీ బాయ్ వద్ద నుంచి ఇద్దరు దుండగులు సెల్ ఫోన్ లాక్కొని పారిపోయారు. విజయనగరానికి చెందిన మోహన్‌రావు నగరంలో షేక్‌పేటలో నివాసముంటూ జెప్టో డెలవరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 22న ఓ వాటర్ బాటిల్ డెలవరీ వచ్చింది. దాన్ని వినియోగదారుడికి అందించేందుకు ద్విచక్ర వాహనంపై ఎమ్మెల్యే కాలనీలో ఓమెగా ఆసుపత్రి వద్దకు చేరుకున్నాడు. ఇంతలో ఇద్దరు యువకులు అతన్ని మాటల్లో పెట్టి చేతిలో ఉన్న వీవో సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఈశాన్య రాష్ట్రాల

వ్యవస్థాపక దినోత్సవం



రాజ్‌భవన్‌లో వేడుకలను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్, హెచ్‌సీయూ ప్రొఫెసర్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాల వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలోని రాజ్‌భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌సీయూలోని మేఘాలయ, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ఆచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జ్యోతి వెలిగించి ఈ వేడుకలను ప్రారంభించారు. అనంతరం గవర్నర్ విద్యార్థులను, ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల వ్యవస్థాపక దినోత్సవాలను ఒకే వేదికపై జరుపుకోవడం.. బహుళ సంస్కృతుల స్వరూపం ఒక్కతాటిపైకి వచ్చినట్లయిందన్నారు. ఇది జాతీయతా వాదానికి ఆదర్శంగా, భిన్నత్వంలో ఏకత్వం అనే భావాన్ని వెలువరించిందన్నారు. వివిధ రంగాలకు చెందిన వారు హైదరాబాద్‌లో నివసిస్తున్న ప్రజల భాగస్వామ్యంతో ఈ తరహా కార్యక్రమాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను ఈశాన్య రాష్ట్రాలకు చెందిన డాక్టర్ బరిలాంగ్ మావ్లాంగ్, డాక్టర్ గ్రేసియస్ మేరీ టిమ్సన్ జ్ఞాపికలతో సత్కరించారు. అంతకుముందు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విద్యార్థులు మేఘాలయ రాష్ట్ర హోదాను ప్రశంసిస్తూ ప్రేరణాత్మక గీతాన్ని ఆలపించారు.



ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు

విద్యుత్ ఉద్యోగులకు సంపూర్ణ సహకారం అందిస్తాం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని విద్యుత్ ఉద్యోగులకు అవసరమైన సహకారం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ, వాల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు.

తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ డైరీ ఆవిష్కరణ

తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సరపు డైరీని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు.

ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్

ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ (టీఈఏఎస్ఏ) ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం ఆవిష్కరించారు. ప్రజా భవన్‌లో గురువారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, ఈశ్వర్ గౌడ్‌లతోపాటు అసోసియేషన్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థల్లో ఉన్న సమస్యలను వివరించారు. పెన్షన్ సదుపాయం, ఖాళీగా ఉన్న పోస్టుల్లో పదోన్నతులు, రిక్రూట్‌మెంట్‌లు చేపట్టాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు ప్రభాకర్‌రావు, ఈశ్వరయ్యగౌడ్, కుమారస్వామి, సాంబశివరావు, బాలరాజు, ఇమాన్యుయల్ రాజు, సురేష్, హరిహరన్, వేద ప్రకాశ్, నిత్యకళ్యాణి, కల్పన, అశోక్, రమేష్, భానురేఖ పాల్గొన్నారు.

పరుగుల వీరుడు.. ఈ ఫైర్ ఆఫీసర్

ప్రోకామ్ స్లామ్ 2024-25 టైటిల్‌ను సాధించిన ఫైర్ ఆఫీసర్..



జీవి ప్రసాద్‌ను సత్కరిస్తున్న తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి

ఖైరతాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఫైర్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే ఫిట్‌నెస్‌తో పాటు ఏదో ఒకటి సాధించాలనే తపనతో దేశంలో ఎక్కడ మారథాన్‌లు జరిగినా పాల్గొంటూ తనకంటూ ఓ ప్రత్యేకత సాధించుకున్నారు ప్రసాద్. సచివాలయం ఫైర్ స్టేషన్ కేంద్రంగా హైదరాబాద్ జిల్లా సహాయ ఫైర్ అధికారిగా పనిచేస్తున్న జీవి ప్రసాద్ ప్రోకామ్ స్లామ్ టైటిల్‌ను సాధించడంతో శాఖ ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ప్రోకామ్ స్లామ్‌లో భాగంగా ప్రసాద్ టీసీఎస్ బెంగుళూరులో జరిగిన 10కె ను, వేదాంత ఢిల్లీ హాఫ్ మారథాన్ (21.1కె), టాటా స్టీల్ కోల్‌కతా25కె మారథాన్‌తో పాటు ఇటీవలే జరిగిన టాటా ముంబై 42 కె మారథాన్‌ను పూర్తి చేసి సర్టిఫికెట్లను, ప్రశంసా పత్రాలను అందుకొని హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇప్పటివరకు 41 మెడల్స్‌తో పాటు, ఎన్నో బహుమతులు అందుకున్న ప్రసాద్‌ను గురువారం తెలంగాణ ఫైర్ సర్వీసులశాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డితో పాటు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి హరినాథరెడ్డి, ఇతర అధికారులు సత్కరించారు. తాను నాలుగు మారథాన్‌లను సాధించడం చాలా సంతోషంగా ఉన్నదని, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో రాబోయే రోజుల్లో మరిన్ని ఈవెంట్లలో పాల్గొంటానని ప్రసాద్ తెలిపారు.

సుభాష్‌చంద్రబోస్‌కు ఘన నివాళి



రాజ్‌భవన్‌లో వేడుకలను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్, హెచ్‌సీయూ ప్రొఫెసర్లు

ఘనంగా ఈశాన్య రాష్ట్రాల వ్యవస్థాపక దినోత్సవం

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాల వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలోని రాజ్‌భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌సీయూలోని మేఘాలయ, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ఆచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జ్యోతి వెలిగించి ఈ వేడుకలను ప్రారంభించారు. అనంతరం గవర్నర్ విద్యార్థులను, ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల వ్యవస్థాపక దినోత్సవాలను ఒకే వేదికపై జరుపుకోవడం.. బహుళ సంస్కృతుల స్వరూపం ఒక్కతాటిపైకి వచ్చినట్లయిందన్నారు. ఇది జాతీయతా వాదానికి ఆదర్శంగా, భిన్నత్వంలో ఏకత్వం అనే భావాన్ని వెలువరించిందన్నారు. వివిధ రంగాలకు చెందిన వారు హైదరాబాద్‌లో నివసిస్తున్న ప్రజల భాగస్వామ్యంతో ఈ తరహా కార్యక్రమాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను ఈశాన్య రాష్ట్రాలకు చెందిన డాక్టర్ బరిలాంగ్ మావ్లాంగ్, డాక్టర్ గ్రేసియస్ మేరీ టెమ్సన్ జ్ఞాపికలతో సత్కరించారు. అంతకు ముందు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విద్యార్థులు మేఘాలయ రాష్ట్ర హోదాను ప్రశంసిస్తూ ప్రేరణాత్మక గీతాన్ని ఆలపించారు.



పద్మారావుగౌడ్‌ను పరామర్శిస్తున్న టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ తదితరులు

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు టీడీపీ నేతల పరామర్శ

బౌద్ధనగర్, జనవరి23(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురై విశ్రాంతి తీసుకుంటున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను గురువారం సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు పరామర్శించారు. సికింద్రాబాద్ టకరబస్తీలోని ఆయన నివాసంలో టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్, సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు జీవీ కృష్ణ, ముఖ్యనాయకులు విజయ్‌కుమార్, చిరంజీవిరాజు, శశికళ తదితరులు పద్మారావుగౌడ్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

‘ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులు’

మారేడుపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె.రామకృష్ణ తెలిపారు. గురువారం కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు పరిధిలోని వాల్మీకి నగర్‌లో ఆయన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జె.రామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో బస్తీబాట కార్యక్రమంలో భాగంగా వాల్మీకి నగర్‌లో రోడ్డు సమస్యను గుర్తించామని, అప్పుడు వారికి ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ 5 బీజేపీ అధ్యక్షులు సంతోష్, కాలనీ వాసులు నరేందర్, శ్రీహరి, స్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

వివాన్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం



పురస్కారంతో వివాన్

చిలకలగూడ,జనవరి23(ఆంధ్రజ్యోతి): రెండున్నర ఏళ్ల తన మనుమడు వివాన్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2025 పురస్కారం అందు కున్నట్లు మాజీ రైల్వే ఉద్యోగి జి. రామకోటేశ్వర రావు తెలిపారు. 13 నిమిషాల్లో 233 రకాల వివిధ జంతువులు, శరీర భాగాలు, వాహనాలు గుర్తించి చక్కని జ్ఞాపక శక్తితో బహుమతి కైవసం చేసుకున్నాడన్నారు. గతంలో కూడా వివాన్ పలు పోటీల్లో బహుమతులు అందుకున్నాడని తెలిపారు. బంధువులు, మిత్రులు వివాన్‌కు అభినందనలు తెలిపారు.

సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవం

మారేడుపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ మారేడుపల్లి సంజీవయ్య కాలనీలోని సీతారామస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మహిళా యువజన నాయకురాలు కుమారి సి.వైష్ణవి వేడుకల్లో పాల్గొని స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భూమయ్య, భాస్కర్‌రెడ్డి, సంతోష్, శ్రీను, రాజు, కోటేశ్వరరావు, నర్సింగ రావు, ప్రకాష్ పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు

అతివేగంతో ప్రమాదాలు

బౌద్ధనగర్, జనవరి23(ఆంధ్రజ్యోతి): అతివేగం, ర్యాష్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, అందువల్ల వాహనాలను నెమ్మదిగా నడపాలని చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆలుగడ్డబావి వద్ద ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, వాహనాలను అతివేగంగా నడపవద్దని, త్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వలన ప్రమాదాల బారినపడే అవకాశలున్నాయని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

తిరుమలగిరి జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు సిబ్బంది, ఆర్టీఓ ఎర్రస్వామి, రవాణాశాఖ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో తిరుమలగిరి చౌరస్తాలో గురువారం ట్రాఫిక్ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. రోడ్డు భద్రతా మాసోత్సవంల్లో భాగంగా ఫ్లెక్సీలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ కరపత్రాలు పంచుతూ ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పకుండా శిరస్త్రాణం ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్టు ధరించాలని విజప్తి చేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఎస్‌ఐ శ్రీకాంత్ ఇంకా సిబ్బంది పాల్గొన్నారు.



బలంరాయి చౌరస్తాలో గురువారం రోడ్డుభద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. మారేడుపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జె.భాస్కర్ ఆదేశాల మేరకు ఎస్సై హరీష్‌గౌడ్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. (సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)

సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో జయంతి వేడుకలు

భారతమాత ముద్దుబిడ్డ, దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి బ్రిటీష్ వారిని గడగడలాడించిన ధీశాలి నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు.

- సికింద్రాబాద్, కంటోన్మెంట్ జోన్ల బృందం

వారాసిగూడలో..

బౌద్ధనగర్, జనవరి23(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ చౌరస్తాలో నేతాజీ విగ్రహానికి కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నేతాజీ స్కూల్ వ్యవస్థాపకుడుచ కోట్ల నిరంజన్‌రెడ్డి, బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు పి.సాయిప్రసాద్ గౌడ్, నాయకులు శైలేందర్, బెజ్జంకి రాజేష్, మేకల కీర్తిహర్షకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో..

రెజిమెంటల్‌బజార్ ,జనవరి 23(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ విగ్రహానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్ర కుమార్, కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు అల్లాడి గౌరీ శంకర్, నందికంటి రవి, టీడీపీ మల్కాజిగిరి అడ్‌హాక్ కమిటీ సభ్యులు గౌరీ శంకర్ యాదవ్, కార్పొరేటర్ కొంతం దీపిక నివాళులర్పించారు.

తుకారాంగేట్‌లో..

అడ్డగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సుభాష్ చంద్రబోస్ అసోసియేషన్ ప్రతినిధులు అల్లం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో తుకారాంగేట్‌కు చెందిన పలువురు పలు పార్టీల నాయకులు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించార వివిధ పార్టీల నాయకులు నాగేశ్వర్ రావు, అల్లం విజయ్, జవహర్ శాస్త్రి, రమేష్, ప్రసాద్, సదా, ప్రకాశ్, శివ, మధులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు



వారాసిగూడలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ తదితరులు



నివాళులర్పిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ తదితరులు



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసిన బీజేపీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి తదితరులు



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకుడు గౌరీశంకర్ యాదవ్ తదితరులు



తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి తదితరులు



తుకారాంగేట్‌లో నివాళులర్పిస్తున్న యూత్ నాయకులు



చిలకలగూడ బీజేపీ కార్యాలయం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకుడు మేకల చంద్రశేఖర్ రావు తదితరులు



బోయిన్‌పల్లిలో స్వామి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పార్సిగుట్టలో ‘సంవిధాన్ గౌరవ్ అభియాన్’

బౌద్ధనగర్, జనవరి23(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రచించి 75 వసంతాలు పూరైన సందర్భంగా గురువారం పార్సిగుట్టలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధికారప్రతినిధి ఎం.పాండుమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు పి.సాయిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సాయిదత్తు, శ్యామ్‌రాజ్, లడ్డూ, సంపత్, చైతన్య, నాగమణి, సుదర్శన్, అజయ్, గిరి, ఓములు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఫెస్టివల్ ప్రారంభం

తిరుమలగిరి జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాల వైపు మొగ్గు చూపకుండా క్రీడలను ప్రోత్సాహిస్తున్నామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరవింద్ అన్నారు. బొల్లారం రీడింగ్ రూమ్ ప్రాంగణంలో స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్‌ను గురువారం టాస్ వేసి ప్రారంభించారు. క్యారం, చదరంగం, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గణతంత్ర దినోత్సవం వరకు ఈ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు. జీవీ బాల్‌రాజ్, సతీష్, రషీద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు : ఎమ్మెల్యే శ్రీ గణేశ్

అడ్డగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ రేషన్ కార్డులు వస్తాయని, ఎవ్వరూ అధైర్యపడవద్దని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ స్పష్టం చేశారు. గురువారం మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భీమయ్యగౌడ్ ఆధ్వర్యంలో మారేడుపల్లికి చెందిన 17 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కార్డుల సర్వే జరుగుతోందని, కొన్ని బస్తీలకు సర్వే చేసేందుకు రాలేదని ఎవరు కూడా అధైర్యపడవద్దని, కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి ఆధ్వర్యంలో రేషన్ కార్డుల సర్వే జరుగుతుందన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు వస్తాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సర్వేయర్లు మోహన్, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ మాజీ చైర్మన్ సంతోష్ యాదవ్, రైల్ నిలయం కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంబయ్య, వెంకటేశ్వర్లు, రంగారవీంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న కానిస్టేబుల్ వినోద్ తల్లి

కానిస్టేబుల్ వినోద్ కుటుంబానికి స్థలం కేటాయించాలి

అడ్డగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో అమరుడైన కానిస్టేబుల్ వినోద్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి 250 గజాల స్థలం కేటాయించాలని గురువారం ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంతోష్ యాద వ్ ఆధ్వర్యంలో వినోద్ తల్లి ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు శివ తదితరులు ఉన్నారు.

ధోబీఘాట్‌ను సందర్శించిన రజక నాయకులు

సికింద్రాబాద్, జనవరి23(ఆంధ్రజ్యోతి): సిక్‌విలేజ్ మడ్‌ఫోర్ట్‌లోని ధోబిఘాట్‌ను గురువారం తెలంగాణ రజక వృత్తి సంఘం నాయకులు సందర్శించారు. రజకుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధోబీఘాట్‌లో విద్యుత్‌బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, వాషింగ్ మిషన్లు రిపేర్‌కు వస్తే చాలా ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రహరీ లేకపోవటం వల్ల ఖరీదైన దుస్తులను చోరీ అవుతున్నాయని తెలిపారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటి నాయకులు పి.రాజు, నాయకులు బాలనర్సింహులు, ఆనంద్‌స్వామి, పరుశురాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



రిపబ్లిక్ డే రిహార్సల్స్...

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం గణతంత్ర దినోత్సవం కోసం సాధన చేస్తున్న పోలీసు బలగాలు

అండర్ 15 ఆలిండియా మెగా చెస్ టోర్నమెంట్

- వరాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వరాస్ చెస్ అకాడ మీ ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి అండర్ 15 ఆలిండియా మెగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అకాడమీ ఫౌండర్, చీఫ్ కోచ్ రాఘవ్ శ్రీవాత్సవ్ వరయోగి తెలిపారు. జాతీయ స్థాయిలో రెండోసారి ఏర్పాటు చేస్తున్న మెగా చెస్ టోర్నమెంట్ విజేతలకు రూ.75వేల నగదుతోపాటు 50 ట్రోఫీలు అందిస్తామన్నారు. బేగంపేట పాటిగడ్డ జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్(రసూల్‌పురా మెట్రోస్టేషన్) సమీపంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పా ల్గొనాలనుకునే వారు 7396847937నంబర్‌ను సంప్రదించాలని, లేదా వివరాలకు www.varaschessacadamy.com వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



రైల్వే స్టేషన్‌లో మృతి చెందిన గుర్తుతెలియని వృద్ధుడు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి రైల్వే స్టేషన్ లో చనిపోయిన గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నంబరు 7లో గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దాడి కేసులో ఇద్దరికి ఆరు రోజుల జైలు శిక్ష

అడ్డగుట్ట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అకారణంగా ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు యువకులకు సికింద్రాబాద్ కోర్టు ఆరు రోజుల జైలుశిక్ష విధించింది. పోలలీసుల కథనం ప్రకారం.. కట్టెల మండి ప్రాంతానికి చెందిన కృష్ణ బుధవారం లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాలాపేట ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా, అదే ప్రాంతానికి చెందిన వెంకటేష్‌గౌడ్, ఉదయ్ కిరణ్‌లు అకారణంగా మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారు. బాధితుడు లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న లాలాగూడ పోలీసులు ఇద్దరు వ్యక్తుల్ని సికింద్రాబాద్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఇద్దరికీ ఆరు రోజుల పాటు జైలు శిక్ష విధించింది.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలి

- ఫుట్‌పాత్ వ్యాపారులకు ఎమ్మెల్యే తలసాని సూచన



పాలికాబజార్ చౌరస్తాలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

రెజిమెంటల్‌బజార్,జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారులు ట్రాఫిక్ అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ శాఖల అధికారులతో ఫుట్‌పాత్ వ్యాపారాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. మోండా డివిజన్ పాలికాబజార్ చౌరస్తా నుంచి బయలుదేరి మోండా మార్కెట్, రాంగోపాల్ పేట డివిజన్‌లోని అంజలి టాకీస్ దర్గా, పీజీ రోడ్డు, మినిస్టర్ రోడ్డు ప్రాంతాలలో ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, ఫుట్‌పాత్ వ్యాపారులను ఏ శాఖ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బంది పెట్టరని, అయితే, కొందరు ఇష్టానుసారంగా ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించి వాహనదారులకు, ప్రజలకు అసౌకర్యం కలిగేలా చేసినప్పుడే ఆయా శాఖల అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటారని అన్నారు. ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి కొంత మంది అద్దెలు వసూల్ చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, వ్యాపారులు ఎవ్వరికీ అద్దె చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో ఫుట్‌పాత్ వ్యాపారులకు ఫొటోతో కూడిన గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు కూడా మానవతా దృక్పథంతో సహకరించాలని, ఫుట్‌పాత్ వ్యాపారులకు ఉపాధిని దూరం చేసి వారి కుటుంబాలను ఇబ్బంది పెట్టొద్దని కోరారు. కార్యక్రమంలో డీసీ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుస్మిత, నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.